## క్లుప్తంగా

### నేడు ఉచిత వైద్య శిబిరం

**బోట్‌క్లబ్:** స్థానిక గాంధీనగర్ మల్లయ్య అగ్రహారం బాలభక్త సంఘం రామాలయం వద్ద ఆదివారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిలీప్ విజన్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అసోసియేట్ కస్టమర్ కేర్ కోర్సుకు ఉచిత శిక్షణ

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** ఉపాధి శిక్షణశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కార్యాలయంలో అసోసియేట్ కస్టమర్ కేర్ (వాయిస్ అండ్ నాన్‌వాయిస్) కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి జి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వయస్సు 18 నుంచి 30 ఏళ్లలోపు కలిగి ఉండాలని, ఏదైనా డిప్లమో లేదా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పిస్తామని, వివరాలకు 86398 46568 నంబరులో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

### జూదరులను అరెస్ట్ చేయాలి

**యానాం:** స్థానిక కొత్త బస్టాండ్ మున్సిపాల్ లాడ్జిలో ఈ నెల 2న అర్ధరాత్రి పేకాట క్లబ్‌పై అధికారులు దాడి ఘటనకు సంబంధించి నిందితులు, నిర్వాహకులపై ఇప్పటివరకూ పోలీస్ శాఖ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై శనివారం పలువురు పుదుచ్చేరి ఉన్నత పోలీస్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు సుమారు వంద మంది జూదరులు రూ.లక్షల్లో చేతులు మార్చుతూ యథేచ్ఛగా పేకాట ఆడుతున్నప్పటికీ కేవలం పదడుగుల దూరంలో పోలీస్ స్టేషన్ ఉన్నా స్పందించ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఖరీఫ్‌కు సన్నద్ధం

- నేల స్వభావాన్ని బట్టి విత్తన ఎంపిక
- నారుమడి తయారీలో యాజమాన్యంతో అధిక దిగుబడులు
- అన్నదాతకు సూచనలిస్తున్న అధికారులు


ఖరీఫ్ నారుమడి తయారీకి దమ్ముచేస్తున్న ట్రాక్టర్.

**కరప:** ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ప్రధానమైంది. రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమైంది. అక్కడక్కడ వర్షాలు పడుతుండటంతో సబ్ డివిజన్ పరిధి రైతులు నారుమళ్ల తయారీకి ఉపక్రమిస్తున్నారు. రైతులు తమ భూముల స్వభావాన్ని బట్టి ఆయా రకాలు సాగు చేసుకోవాలని, వరి నారుమడి నుంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మలచుకోవచ్చని ఎంఏఓ ఏవీ రాజేష్ రైతులకు సూచిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించాలంటే మంచి రకాల ఎంపిక, నారుమడి తయారీ, విత్తన శుద్ధి, ఎరువులు, పురుగు మందుల వాడకం, కలుపు నివారణలో యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలి.

**ఖరీఫ్ పంటకు అనువైన రకాలు**

సాధారణ పరిస్థితులో నాటడానికి ఎంటీయూ–7029 (స్వర్ణ), స్వర్ణకు ప్రత్యామ్నాయంగా కొత్తగా రూపొందించిన ఎంటీయూ–1318 రకాన్ని కూడా వినియోగించుకోవచ్చు. చేను పడిపోకుండా, నిలదొక్కుకుని ఉంటుంది. ముంపునకు తట్టుకుంటుంది. సన్నరకాలైన ఎంటీయూ–1282 తక్కువ ఎరువులు వాడితే సరిపోతుంది. సన్నరకం సాంబమసూరికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1282 రకాన్ని కూడా సాగుచేసుకోవచ్చు. ఎంటీయూ–1318, ఎంటీయూ–1282 సాగు చివరిలో బ్యాక్టీరియా మూలంగా ఆకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు పంటను పర్యవేక్షిస్తూ, ప్రారంభదశలోనే గుర్తిస్తే, ఆకు ఎండుతెగులు నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చు. అలాగే ఈ రకాలకు యూరియా ఎక్కువగా వాడకూడదు. సాధారణ రకాల కంటే నాలుగు వంతుల్లో ఒక వంతు తగ్గించి యూరియాను వాడాలి. ప్రైవేటు రకం సంపద స్వర్ణ రకం కూడా సార్వాకు అనుకూలం.

**విత్తనశుద్ధి ఇలా**

విత్తనం ద్వారా వ్యాప్తి చెందే కొన్ని రకాల తెగుళ్ల అరికట్టడానికి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. ఇందుకు సూడోమోనస్, కార్బండిజమ్ మందులను వినియోగించవచ్చు. విత్తనశుద్ధి రెండురకాలుగా చేసుకోవచ్చు. మొదటిది పొడి విత్తనశుద్ధి. దీనికి కిలో విత్తనానికి 8 నుంచి 10 గ్రాములు సూడోమోనస్ కానీ, కార్బండిజమ్ కానీ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. రెండవది తడి విత్తనశుద్ధి. దీనికి లీటరు నీటిలో 10 గ్రాములు సూడోమోనస్ లేదా కార్బండిజమ్ మందును కలిపి ఆ ద్రావణంలో ఒక కిలో విత్తనాలు వంతున 24 గంటలు నానబెట్టి, మరో 24 గంటలు మండికట్టి మొలక వచ్చిన విత్తనాలను దమ్ముచేసిన నారుమడిలో చల్లుకోవాలి.


కరపలోని ప్రైవేటు షాపునకు వచ్చిన విత్తనాలను పరిశీలిస్తున్న ఎంఏఓ రాజేష్

**విత్తన మోతాదు ఇలా**

వరినాటే పద్ధతిలో ఎకరానికి 25 నుంచి 30 కిలోలు, వెదజల్లు పద్ధతిలో ఎకరానికి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి.

**నారుమడి పెంపకం**

దృఢమైన, ఆరోగ్యవంతమైన నారు పొందాలంటే నారుమడిని 12 రోజులు ముందు దమ్ముచేసి, చిన్న మడులుగా విభజించుకోవాలి. నీరు పెట్టడానికి, తొలగించడానికి వీలుగా పిల్ల కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి సెంటు భూమిలో 5 కిలోల వంతున విత్తనాలు చల్లుకోవాలి. విత్తనం ఎక్కువైతే నారు బలహీనంగా ఉండి, మాగుడుతెగులు సోకే అవకాశం ఉంది. ఎక్కువ విత్తనాలు పోస్తే నారు తీసేటప్పుడు వేర్లు తెగిపోయి సులువుగా రాదు. ఎకరానికి 5 సెంట్ల నారుమడి సరిపోతుంది. మొలక కట్టిన విత్తనాన్ని పలుచటి నీటిమీద చల్లుకోవాలి. నారు రెండుమూడు ఆకులు తొడిగే వరకు ఆరుతడి పెడుతూ ఉండాలి. తర్వాత పలుచగా నీరుండేలా చూసుకోవాలి.

**నారుమడి–ఎరువుల యాజమాన్యం**

దమ్ములో ప్రతి 5 సెంట్ల నారుమడికి 2 కిలోల యూరియా, 7 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 2 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వంతున వేసుకోవాలి. విత్తిన రెండు వారాల తర్వాత మళ్లీ 2 కిలోల యూరియా పైపాటుగా వేయాలి.

### నారుమడిలో సస్య రక్షణ



అవసరాన్ని బట్టి నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారుమడి దశలో కాండం తొలుచుపురుగు, ఉల్లికోడు, పచ్చ దీపపు పురుగులు, తాటాకు పురుగు, తామర పురుగులు, నారు కత్తిరించే పురుగులు కనిపిస్తుంటాయి. వీటి నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా ప్రొఫినోఫాస్ 2 మిల్లీ లీటర్ల వంతున ఏదో ఒక మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా నారు తీసే వారం రోజుల ముందు కార్బోఫ్యురాన్ 3జి గుళికలను సిఫార్సు చేసిన మోతాదులో చల్లుకోవాలి. రెతులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ సిబ్బందిని కలసి తగిన సలహాలు పొందాలని ఎంఏఓ రాజేష్ సూచించారు.

ఏవీ రాజేష్,
కరప మండల వ్యవసాయాధికారి.

# సురక్షిత ఆహారంతో ఆరోగ్య జీవనం


ఆహార భద్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

**కాకినాడ రూరల్:** ప్రపంచ ఆహార సురక్షిత దినోత్సవాన్ని శనివారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సురక్షిత ఆహారాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ×ఆహార భద్రత – సైన్స్ ఇన్ యాక్షన్¤ అనే థీమ్‌తో వినియోగదారులను రక్షించడంలో, మనం మన టేబుల్‌కు తీసుకువచ్చే ఆహారంపై నమ్మకాన్ని పెంపొందించడంలో సైన్స్ ప్రాముఖ్యతను గుర్తిస్తుందన్నారు. ఆహారం కంటే సురక్షితమైన ఆహారం అవసరమని గుర్తించడానికి ఏటా జూన్ 7న ప్రపంచ ఆహార సురక్షిత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ఆహార కల్తీ కేసుల సంఖ్య 28 శాతం ఉండగా, 38% ప్యాక్ చేసిన ఆహారాన్ని తీసుకుంటున్నారని అన్నారు. కలుషితహారం తీసుకోవడం వల్ల పలు రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులతో తయారైన ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ అడ్డాల తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా యోగా తరగతులు


సూర్య కళామందిరంలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

**నాగమల్లితోట జంక్షన్:** పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమాలు పలుచోట్ల ప్రారంభించారు. శనివారం కాకినాడ పట్టణం సూర్యకళా మందిరంలో, పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. సూర్యకళా మందిరంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏయూ రీజియన్ ఏడీ టి.జగదీష్ ఆధ్వర్యంలో, అంబేడ్కర్ ఆడిటోరియంలో ఇంటర్మీడియెట్ విద్య, రెవెన్యూ, ఆయుష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. సూర్యకళామందిరంలో యోగా శిక్షకులు జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ సుధాదేవి, జి.కృష్ణమోహన్ ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు, ఇతర సిబ్బందిచే యోగాసనాలు సాధన చేయించారు. అనంతరం నిత్యజీవితంలో యోగా ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థి లక్ష్ పరిక్ పతాంజలి ఏకపాత్రాభినయం, మహిళలు ప్రదర్శించిన ఏకాంకిక, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే అంబేడ్కర్ ఆడిటోరియంలో కాకినాడ రూరల్ పరిధిలోని కళాశాలల అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది సుమారు 300 మందికి యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పతంజలి మహర్షి చిత్రపటానికి వందనాలు సమర్పించారు. సాధకులకు కలెక్టర్ అభినందనలు తెలియజేసి యోగా ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం యోగాచార్య చిట్టిబాబు ఆహూతులకు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ ప్రక్రియల శిక్షణ ఇచ్చి వాటి ఫలితాలను వివరించారు. అలాగే బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు ధ్యానం, రాజ యోగం అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ శారద, కాకినాడ రూరల్ తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, ఆయుష్ వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి, లక్ష్మణ కుమార్, డీటీ చయనులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న లయన్స్ సభ్యులు

**కాకినాడ రూరల్:** రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో అంతర్జాతీయ లయన్స్ క్లబ్ 108వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ చికాగోలో మెల్విన్ జోన్స్ 1917 జూన్ 7న లయన్స్ క్లబ్‌ను స్థాపించారన్నారు. వర్గాలకు అతీతంగా 206 దేశాలలో ఈ క్లబ్ సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా జోన్స్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**సేవా కార్యక్రమాలకు చిరునామా లయన్స్ క్లబ్**

**బోట్‌క్లబ్:** సమాజంలో ప్రజా అవసరాలు తీర్చడంలో, సేవా కార్యక్రమాలు చేయడంలో లయన్స్ క్లబ్ చిరునామాగా మారిందని గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు. స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని చిట్నీడి శ్రీనివాస్ నివాసంలో శనివారం లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. సమాజంలో లయన్స్‌క్లబ్ సభ్యులకు ఎంతో గౌరవం ఉందన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అడ్డాల సత్యనారాయణ, వినోద్, మెట్టా రాధ తదితరులు పాల్గొన్నారు.


మెల్విన్ జోన్స్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న క్లబ్ సభ్యులు

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**సామర్లకోట:** దేశ వ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐలు ఎ.కృష్ణభగవాన్, అంకబాబు పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో శనివారం సైబర్ నేరాలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్, లోన్లు, షేర్స్ పేరుతో మోసాలు జరుగుతున్నాయని ప్రతి ఒక్కరూ నిత్యం అప్రమతంగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని హెచ్చరించారు. ఎంతో మేధావులు కూడా సైబర్ నేరాలలో చిక్కుకుని కోటి రూపాయాలు నష్టపోయిన సంఘటనలు ఉన్నాయని అంకబాబు వివరించారు. రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిపై నిఘా వేయాలన్నారు. అటువంటి వారిపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు.


ఆటో డ్రైవర్లకు కాకి యూనిఫాం అందజేస్తున్న డీఎస్పీ, సీఐలు

**యూనిఫాం విధిగా ధరించాలి**

ఆటో డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫారం ధరించాలని డీఎస్పీ డి.శ్రీహరిరాజు అన్నారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, వేట్లపాలెం, ఉండూరు ఆటో స్టాండ్లలోని డ్రైవర్లకు కాకి యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పని సరిగా ఖాకీ యూనిఫాం ధరించాలన్నారు. యూనిఫారం ఉండటంతో ఆటో డ్రైవర్‌గా గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనేక మంది టీషర్టు, షార్ట్‌లను ధరించడం వలన ప్రయాణికులు ఎవరో ఆటో డ్రైవర్లు ఎవరో గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోందని, నేరాలు అదుపు చేయడానికి ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలన్నారు. ఖాకీ యూనిఫారం ధరించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ భగవాన్, క్రైమ్ సీఐ అంకబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెదడు సంకేతాలను అశ్రద్ధ చేయొద్దు

**కాకినాడ రూరల్:** మెదడు ఇచ్చే సంకేతాలపై అశ్రద్ధ వద్దని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ చందు లింగోలు తెలియజేశారు. ఆదివారం ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి శనివారం ఆయన అవగాహన కల్పించారు. నిత్యం వచ్చే తలనొప్పిని మనం పని ఒత్తిడిగాను, కళ్లు తిరగడాన్ని అలసటగా తేలిగ్గా తీసుకుంటామని ఒక్కోసారి సాధారణ సంకేతాలే మన మెదడులోని తీవ్రమైన సమస్యకు కారణం కావచ్చని డాక్టరు చందు పేర్కొన్నారు. బ్రెయిన్ ట్యూమర్లు అరుదైనవి కావని, ఇవి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా రావచ్చన్నారు. సరైన సమయంలో గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదన్నారు. న్యూరో ఫిజీషియన్ డాక్టరు కృష్ణ భాస్కర్ మాట్లాడుతూ ఉదయం పూట వచ్చే తీవ్రమైన తలనొప్పులు, వ్యక్తిత్వంలో ఆకస్మిక మార్పులు, చూపు మసకబారడం, మాట తడబడడం, మతి మరుపు లేదా ఫిట్స్ వంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయవద్దన్నారు. మెడికవర్ ఆస్పత్రిలో అందించే వైద్య సేవలను యూనిట్ హెడ్ శుభాకర్ వివరించారు. చిన్న స్కాన్ ఒక సరైన వైద్య నిర్ణయానికి కారణమవుతుందని, జీవితాన్ని ఇవ్వడంతో పాటు ఒక కుటుంబ భవిష్యత్‌ను మార్చగలదన్నారు.

### కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

| | |
|---|---|
| **మున్సిపల్ అధికారులు** | |
| కమిషనర్ | 9100945696 |
| అదనపు కమిషనర్ | 9849907096 |
| డిప్యూటీ కమిషనర్ | 9949921555 |
| ఏసీపీ | 9989743049 |
| ఎంహెచ్‌వో | 9949432320 |
| ఎస్ఈ | 9959988639 |
| మేనేజర్ | 7093519888 |
| టీపీఆర్వో | 9701385284 |
| అకౌంట్ ఆఫీసర్ | 9849907084 |
| సిటీ మిషన్ మేనేజర్ | 7901610084 |
| **పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు** | |
| డివిజినల్ పంచాయతీ అధికారి | 9849903188 |
| ఫుడ్ ఇన్‌స్పెక్టర్ | 9494297564 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ | 9100121109 |
| జిల్లా వ్యవసాయశాఖాధికారి | 8331056483 |
| దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ | 9290145126 |
| గృహ నిర్మాణశాఖ డీఈ | 7093930577 |
| పశుసంవర్ధకశాఖ జేడీ | 9989932835 |
| డీసీసీబీ జీఎం | 8341208227 |
| జిల్లా సహకారశాఖ అధికారి | 9100109168 |
| **జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు** | |
| సూపరింటెండెంట్ | 98499 03870, 0884 2302001 |
| సీఎస్ ఆర్ఎంవో | 98499 03871 |
| డీసీఎస్ ఆర్ఎంవో | 98499 03871 |
| ఆర్ఎంవో | 0884 2302003 |
| డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ | 0884 2302002 |
| అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) | 98499 03873, 0884 2302004 |
| పోలీస్ అవుట్‌పోస్ట్ | 83329 57924 |
| అత్యవసర విభాగం | 0884 2302021 |
| బ్లడ్ బ్యాంక్ | 0884 2302009 |
| మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ) | 0884 2302018 |

### కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

| | |
|---|---|
| ఎంపీడీఓ | 9346790319 |
| తహసీల్దార్ | 9849903908 |
| ఈఓ పీఆర్ ఆర్డీ | 9849352293 |
| మండల ఇంజనీరింగ్ అధికారి | 8886865417 |
| మండల వ్యవసాయాధికారి | 8331056589 |
| ఎంఈఓ–1 | 8008293994 |
| ఎంఈఓ–2 | 8919940656 |
| హౌసింగ్ ఏఈఈ | 7093930450 |
| ఉపాధిపథకం ఏపీఓ | 7093998259 |
| వెలుగు ఏపీఎం | 9959989273 |
| ఎలక్ట్రికల్ ఏఈ | 9440812638 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ | 9603007219 |
| ఇరిగేషన్ ఏఈఈ | 9704651826 |
| డ్రెయినేజ్‌శాఖ ఏఈఈ | 9963744219 |
| ఆర్అండ్‌బి ఏఈఈ | 9440818530 |
| కరప పీహెచ్‌సీ డాక్టర్ | 8096940176 |
| వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ | 9962553545 |
| పశుసంవర్ధకశాఖ ఏడీఏ | 9490047668 |
| నడకుదురు వెటర్నరీడాక్టర్ | 9652547579 |
| వేళంగి వెటర్నరీ డాక్టర్ | 8332973558 |
| అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్ | 9494671642 |
| ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ | 9704512131 |
| ఐసీడీఎస్ సూపర్‌వైజర్ | 9492600813 |
| కరప ఎస్ఐ | 9440796557 |
| తాళ్లరేవు ఎక్సైజు సీఐ | 9440902407 |

### సమాచారం

| | |
|---|---|
| పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల | 0884–2379480 |
| జేఎన్‌టీయూ కళాశాల | 0884–23800823 |
| జిల్లా ఉపాధి కార్యాలయం | 0884–2373270 |
| ఐటీఐ కళాశాల | 0884–2348182 |
| ఏయూ దూరవిద్యాకేంద్ర | 0884–2383788 |
| జిల్లా రవాణాశాఖాధికారి | 9154294104 |
| జిల్లా విద్యాశాఖాధికారి | 9849909104 |
| స్కిల్ డవలప్‌మెంట్ కార్యాలయం | 8500885866 |

# కూటమిలో మట్టి కుంపటి

- ఆర్‌బీ పట్నం రాఘవమ్మ చెరువులో అక్రమ తవ్వకాలు
- గతంలో రామేశంమెట్ట తాత చెరువులో..
- వాటాలు ఇవ్వడం లేదని జనసైనికుల మండిపాటు
- మెట్ట చెరువుల్లో యథేచ్ఛగా సాగుతున్న దందా


పొక్లెయిన్‌తో మట్టి అక్రమ తవ్వకాలు


మట్టి తవ్వకాలతో ఉనికి కోల్పోతున్న రాఘవమ్మ చెరువు

**పెద్దాపురం:** మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. ఎక్కడ పచ్చని పంటపొలం, మెట్ట కనబడినా దానిని తవ్వి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. రామేశంమెట్టపై ఇప్పటికీ రాత్రనక, పగలనగ నిత్యం గ్రావెల్ దందా సాగిస్తూ రూ. కోట్లు వెనకేసుకున్నారు. ఇదిలా ఉండగా తాజాగా కట్టమూరు రహదారిలోని తాత చెరువుపై కూటమి నేతల కన్నుపడింది. సర్వే నెంబర్ 62/19లో సుమారు 6.51 ఎకరాల తాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతూనే మండలంలోని అతి పెద్ద చెరువు రాయభూపాలపట్నం రాఘవమ్మ చెరువులోనూ నిత్యం రాత్రనక, పగలనక మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. కూటమి నేతల కనుసైగతో గ్రావెల్, మట్టి వ్యాపారం రూ.లక్షల్లో సాగుతోంది.

**వాటాల్లో వంతులాట**

ఆర్‌బీ పట్నంలో జరుగుతున్న అక్రమ మట్టి దందా కూటమి ఐక్యతను చెడగొట్టింది. టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ, ఓ యువ నాయకుడు కలిసి టీడీపీ వాళ్లకే వాటాలు ఇవ్వడం, జన సైనికులకు రూపాయి కూడా ముట్టజెప్పకపోవంతో ఆ గ్రామంలో జన సైనికులు కూటమి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వాటాల్లో భాగాలెలా ఉన్నా ఎన్నికల సమయంలో మేము అంతా దగ్గరుండి మెజార్టీ తెప్పిస్తే గ్రామానికి చెందిన నలుగురు టీడీపీ కార్యకర్తలు తామందరినీ పక్కన పెట్టి దండేసుకుంటున్నారని బహిరంగంగా జనసైనికులు ఆరోపిస్తున్నారు.

**ట్రాక్టర్ మట్టి రూ.2,500**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలకు, రైతు పొలాలకు ఉచితంగా మట్టి తోలుకునేందుకు అనుమతులిస్తే ప్రస్తుత కూటమిలో ఈ మట్టి బకాసురులు మాత్రం ప్రభుత్వానికి రూ.వేలల్లో చలానా చెల్లించినట్లు చెప్పుకొంటూ ఆదాయం కూడగట్టుకుంటున్నారు. అదికూడా గ్రామానికి చెందిన వేరొకరికి అనుమతి ఉందంటూ ఈ దందాకు పాల్పడుతున్నారు. గతంలో తక్కువ ధరకే మెషీన్ తవ్వకానికి, లారీ ఆయిల్ నిమిత్తం రైతులకు, ఇళ్లకు లారీ ఒక ట్రిప్ లోకల్‌కు రూ.900 తీసుకుని ఉచితంగా మట్టిని సరఫరా చేసేవారు. ఇప్పుడు రూ.2,500 వసూళ్లు చేస్తున్నారు. రాత్రనక, పగలనక పెద్దాపురం, కాకినాడ ప్రాంతాలకు యథేచ్ఛగా మట్టి రవాణా కొనసాగిస్తున్నారు.

**చోద్యం చూస్తున్న రెవెన్యూ, గనుల అధికారులు**

మట్టి, గ్రావెల్ తవ్వకాలు అక్రమంగా తవ్వేస్తున్నా అదుపు చేయాల్సిన రెవెన్యూ, గనుల శాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. మామూళ్ల మత్తు, అధికార పార్టీ నేతల ఆదేశాల ముందు తమ విధులు నిర్వహించలేక మౌనముద్రలో కాలం గడిపేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ ఒక్క రోజూ గ్రావెల్ లారీలు, జేసీబీలను ఆపి మరుసటి రోజన యథాతథంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అబ్బె అక్కడ ఏ తవ్వకాలు జరుగడం లేదు. ఫిర్యాదు అందితే చర్యలు చేపడతామంటూ దాటవేస్తున్నారు.

### ఎటువంటి అనుమతులు లేవు



మట్టి తవ్వకాలకు పెద్దాపురంలో ఎటువంటి అనుమతులు లేవు. గనుల శాఖ అనుమతులున్నాయో లేదో తెలుసుకుంటాం. మా దృష్టికి వస్తే గతంలో తవ్వకాలు నిలిపివేశాం. ఎక్కడైనా గ్రావెల్, మట్టి అనధికార తవ్వకాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవు.

– కె.వెంకటలక్ష్మి, తహసీల్దార్, పెద్దాపురం

### తల్లి, కొడుకు అదృశ్యం


గంగ, రాజ్‌కిరణ్ (ఫైల్)

**యానాం:** నియోజకవర్గ శివారు తీర గ్రామం సావిత్రినగర్ న్యూ కాలనీకి చెందిన ఓ తల్లి, చిన్న కుమారుడు అదృశ్యంపై దరియాలతిప్ప అవుట్‌పోస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఏఎస్సై కాలే సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం.. సావిత్రినగర్‌కు చెందిన తల్లి రేకాడి గంగ, ఆమె చిన్న కుమారుడు రాజ్‌కిరణ్‌లు ఈనెల 4న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, ఆమె భర్త రేకాడి భైరవస్వామి ఫిర్యాదు చేశారు. గంగ, భైరవస్వామిలకు ముగ్గురు కుమారులు. అయితే భైరవస్వామి పనికి వెళ్లిపోతే ఆ రోజు ఇద్దరు కుమారులను స్కూల్‌లో దింపి అనంతరం చిన్న కుమారుడు రాజ్‌కిరణ్‌ను తీసుకుని రాగా గంగ అదృశ్యమయ్యారు. వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేదని పోలీసులు తెలిపారు.